నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 10 మే 2024 | YADADRI BHUVANAGIRI

యాదగిరిగుట్టలో ఎన్నికల ర్యాలీలో ప్రజలకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, పక్కన జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్య గౌడ్

బడుగులంతా బీఆర్ఎస్ వెంటే..

కాంగ్రెస్ అంటేనే మండిపడుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు

- రేవంత్ సర్కారు మోసం చేస్తున్నదని ప్రజలకు అర్థమైంది
- కోమటిరెడ్డి బ్రదర్స్ ఈ ప్రాంతానికి చేసిందేమీ లేదు
- ఎంపీగా గెలిపిస్తే భువనగిరి రుణం తీర్చుకుంటా
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్
- కాంగ్రెస్ పార్టీవి అమలు కాని హామీలు : మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత
- మరోసారి మోసపోకండి.. కారు గుర్తుకు ఓటేయండి : మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్

యాదగిరిగుట్ట, మే9 : బడుగు బలహీనవర్గాల ప్రజలంతా బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, అబద్ధపు హామీలతో కాలయాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి అంటేనే ఎస్సీ, ఎస్టీ, బీసీలు మండిపడున్నారని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందన్న విషయం ప్రజలకు అర్థమైందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా యాదగిరిగుట్ట పట్టణంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, ఎన్‌డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్‌తో కలిసి అభ్యర్థి క్యామ మల్లేశ్ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం చౌరస్తా వద్ద రోడ్ షోలో ఆయన మాట్లాడారు. నిజమైన కాంగ్రెస్ వాదులకు ఆ పార్టీ టికెట్ ఇవ్వలేదన్నారు. రాష్ట్ర మొదటి సీఎం కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి సీఎం రేవంత్‌రెడ్డికి లాగు తడుస్తున్నదని ఎద్దేవా చేశారు. 10 ఏండ్లు ఎంపీగా పని చేసి కోమటిరెడ్డి బ్రదర్స్ ఈ ప్రాంతానికి చేసిందేమీలేదని మండిపడ్డారు. గుట్ట చుట్టూ పొర్లు దండాలు చేసినా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి రాదన్నారు.

సాధ్యం కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ జనాలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామన్నారు.. కానీ ఇప్పుడు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. 17 పార్లమెంట్ స్థానాల్లో 6 స్థానాలకు బడుగుబలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగలు ఉంటే ఒక్కరికి కూడా టికెట్ ఇవ్వలేదని తెలిపారు. మాజీ సీఎం కేసీఆర్ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని దేశంలోనే ప్రఖ్యాత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. యాదగిరిగుట్టలో నర్సన్న మీద సీఎం రేవంత్‌రెడ్డి ఒట్టేసి ఆరు గ్యారెంటీలతో పాటు రుణమాఫీ చేస్తామని హామీనిచ్చారని, ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకోవాలని సూచించారు. ఇంట్లో దేవుడికి దీపం పెట్టని బీజేపీ నాయకులు అయోధ్య రాముడి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్ పోగొట్టుకున్నందుకు ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌ని విడిచిపోతున్నోళ్లు నానబెట్టిన వడ్లలో పైకి తేలిన తాలు లాంటివారని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, అర్ధరాత్రి 12 గంటలకు ఫోన్ చేసినా ఎత్తి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు, కౌన్సిలర్ దండెబోయిన అనిల్, ఆవుల సాయి, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌బాబా, బీఆర్ఎస్ జిల్లా నాయకులు వంటేరు సురేశ్‌రెడ్డి, నాయకులు మిట్ట వెంకటయ్య, పాపట్ల నరహరి, బైరగాని చిన్నపుల్లయ్య, ముఖ్యర్ల సతీశ్‌యాదవ్, ఆకుల శ్రీనివాస్, ఎంపీటీసీలు, పీఏసీఎస్ డైరెక్టర్లు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా యాదగిరిగుట్టలో భారీ ర్యాలీ, పాల్గొన్న ఎన్‌డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మొద్దు : గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

అబద్ధపు మాటలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఆచరణ సాధ్యం కానీ హామీలతో ఆ పార్టీ ఐదేండ్లు అధికారంలో కొనసాగడం కష్టమేనని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. రైతులకు భరోసా జాడే లేదన్నారు. రూ. 4 వేల పింఛన్ ఎక్కడ, రూ. 2 లక్షల రుణమాఫీ ఎప్పుడు అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికే కాంగ్రెస్ సర్కార్ నీళ్లు ఇవ్వక పంటలు ఎండబెట్టిందని, 24 గంటలు కరెంట్ కూడా ఇవ్వలేకపోతున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ సారే రావాలని ప్రజలు కోరుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మొద్దని, ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మరోసారి మోసపోయి కష్టాలు తెచ్చుకోవద్దు : మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేసి కష్టాలు తెచ్చుకున్నామని, మరోసారి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. అభివృద్ధి లేక, నీళ్లు లేక గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా మారిందని తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికీ మంచినీళ్లను అందించిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని చెప్పారు. కారుగుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు గెలిపించాలని కోరారు.

మిగిలింది రెండ్రోజులే..

- సమీపించిన ఎన్నికల ప్రచార గడువు
- 11వ తేదీ సాయంత్రం వరకే క్యాంపెయిన్
- జోరుగా బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

యాదాద్రి భువనగిరి, మే 9 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలకు కౌంట్ డౌన్ దగ్గర పడింది. రాజకీయ పార్టీల ప్రచారానికి మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈ నెల 11వ తేదీ సాయంత్రానికి క్యాంపెయిన్ ముగియనుంది. బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్ జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో అగ్రనేతలు పర్యటించారు.

పార్లమెంట్ ఎన్నికలకు గత నెల 18న నోటిఫికేషన్ విడుదలైంది. అదే నెల 25వరకు నామినేషన్లను స్వీకరించారు. 26న నామపత్రాల పరిశీలన, 29వరకు నామినేషన్ పత్రాల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. దాంతో అన్ని పార్టీలు ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టారు. జనంలోకి వెళ్లేందుకు అన్ని రకాల ప్రణాళికలు చేసుకున్నారు. ఇందుకోసం అందివచ్చిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేశారు. ప్రచార రథాలతో గల్లీగల్లీని చుట్టేస్తున్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో అధిక ప్రాధాన్యం ఇచ్చారు. గెలిస్తే ఏం చేస్తామో వివరిస్తున్నారు.

జనంతో మమేకమైన క్యామ

బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థిగా క్యామ మల్లేశ్‌ను గులాబీ బాస్ కేసీఆర్ ఎంపిక చేసినప్పటి నుంచి గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం, రాత్రి, ఎండ, వేడి అనే తేడా లేకుండా ప్రజలతో మమేకమవుతున్నారు. ప్రతి రోజూ మూడు నుంచి నాలుగు మండలాలు పర్యటిస్తున్నారు. స్థానిక మాజీ ఎమ్మెల్యేల సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. తనదైన శైలితో ప్రసంగిస్తూ జనాన్ని ఆకట్టుకుంటున్నారు. బీఆర్ఎస్‌ను ఎందుకు గెలిపించాలో స్పష్టంగా వివరిస్తున్నారు.

ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రచారం

రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో సీనియర్ నేతలు ఎన్నికల ప్రచారంలో పనిచేస్తుండగా, గ్రామాల్లోనూ కేడర్ జోరుగా దూసుకెళ్తున్నది. బీఆర్ఎస్‌ను ఎలాగైనా గెలిపించుకోవాలనే కసితో ప్రచారం చేస్తున్నది. ఎండలను సైతం లెక్క చేయకుండా ఇంటింటి ప్రచారానికి వెళ్తున్నది. కరపత్రాలు పంచుతూ బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నది. అంతేకాకుండా అలవి కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగడుతున్నది. బీఆర్ఎస్ ఎందుకు గెలవాలో తెలియజేస్తున్నది. దాంతో ప్రజలు సైతం బీఆర్ఎస్‌కు పెద్దఎత్తున మద్దతు తెలియజేస్తున్నారు.

అగ్రనేతల క్యాంపెయిన్..

భువనగిరి పార్లమెంట్ పరిధిలో దాదాపు అన్ని పార్టీల అగ్రనేతలు ప్రచారంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ బస్సు యాత్రలో భాగంగా భువనగిరి పట్టణంలో జరిగిన రోడ్ షోలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరయ్యారు. దాంతో కారు పార్టీలో ఫుల్ జోష్ నెలకొంది. ఇక చండూరులో జరిగిన సభలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్నారు. ఇక మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సైతం ఉమ్మడి జిల్లాలో క్షణం తీరిక లేకుండా ప్రచారం చేస్తున్నారు. భువనగిరిలో జరిగిన కాంగ్రెస్ కార్నర్ షోకు సీఎం రేవంత్ రెడ్డి, రాయగిరిలో బీజేపీ బహిరంగ సభకు ఆ పార్టీ అగ్రనేత అమిత్ షా, చౌటుప్పల్‌లో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరయ్యారు.

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, వేదికపై జడ్పీచైర్ పర్సన్ దీపిక

రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మరు

- భువనగిరి ఎంపీగా క్యామ మల్లేశ్‌ను గెలిపిస్తాం
- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

తుంగతుర్తి, మే 9 : సీఎం రేవంత్‌రెడ్డి గారడి మాటలను ప్రజలు నమ్మరని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని గొట్టిపర్తి గ్రామంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో 420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. అవగాహన లేని వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్నారని, రైతుల రుణమాఫీ జరుగాలంటే సుమారు రూ.30వేల కోట్లు అవసరమని, నిధులు లేకున్నా మాయ మాటలు చెబుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం జలాల ద్వారా సుమారు లక్షా 40వేల ఎకరాలకు సాగునీరు అందించినట్లు తెలిపారు. ఇప్పుడు 80వేల ఎకరాలకు కూడా నీరు అందించలేదని, చాలా చోట్ల పొలాలు ఎండిపోయాయని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాయ మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. భువనగిరి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. మల్లేశ్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగంధర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ శ్రీశైలంయాదవ్, నాయకులు గుండగాని రాములుగౌడ్, హరిబాబు, సాయిలు, శ్రీనివాస్, హరీశ్‌యాదవ్, సోమన్న, లింగయ్య, మురళి, వెంకన్ననాయక్, రవికుమార్, పూర్ణానాయక్, వెంకన్న, రాములు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి 69మంది నామినేషన్

- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- నేడు నామినేషన్ల పరిశీలన, 13 వరకు ఉపసంహరణకు గడువు

నల్లగొండ ప్రతినిధి, మే 9 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ – వరంగల్ – ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగిసింది. మూడు జిల్లాల పరిధిలో ప్రధాన పార్టీలతోపాటు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 69 మంది 117 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ గత నెలలో విడుదల కాగా, ఈ నెల 2నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. సెలవు రోజు మినహాయించి ఏడు రోజులపాటు జిల్లా రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన నామినేషన్లను స్వీకరించారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన చేసి అమోదించిన నామినేషన్లకు అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు. ఈ నెల 13వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉన్నది. ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను విడుదల చేయనున్నారు. సుమారు 12 రోజులపాటు ప్రచారం నిర్వహించి 14వ రోజైన మే 27న పోలింగ్ నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తుంది. కాగా, బీఆర్ఎస్ నుంచి ఏనుముల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్‌కుమార్), బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ప్రధాన పార్టీల తరపున నామినేషన్లు వేశారు. వీరు కాకుండా రాష్ట్రీయ పార్టీలతోపాటు స్వతంత్రులుగా పలువురు నామినేషన్లు దాఖలు చేశారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పరిశీలకుడిగా రాహుల్ బొజ్జ

నీలగిరి, మే 9 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి ఉప ఎన్నికల పరిశీలకుడిగా తెలంగాణ క్యాడర్‌కు చెందిన 2000 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఎస్‌హెచ్ రాహుల్ బొజ్జను నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం ఆయన నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి చాంబర్‌కు నామినేషన్ల పరిశీలనకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం తరపున కలెక్టర్ దాసరి హరిచందన మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్, నల్లగొండ జిల్లా రెవెన్యూ ఆదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జకు పూల మొక్క అందజేస్తున్న కలెక్టర్ హరిచందన

కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

కాంగ్రెస్ మాయ మాటలకు ఆగమాగం కావద్దు

- ఆలోచనతో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలి
- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, మే 9 : కాంగ్రెస్ చెబుతున్న మాయ మాటలకు ఆగమాగం కాకుండా ఆలోచనతో కారు గుర్తుకు ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన రహదారిలో వ్యాపారులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పట్టణం అభివృద్ధి చెందిందని, మరింత అభివృద్ధి కావాలంటే ఎంపీగా క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరారు కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఆర్భాటాలు, ఆరాటాలు తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టడం లేదన్నారు. నాలుగు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీల సంగతి ఏమోగానీ, గత పథకాలను అడ్డుకున్నారని ఆరోపించారు. పదేండ్ల నుంచి అందుతున్న సంక్షేమ పథకాలు ఇప్పుడెందుకు వస్తలేవని ప్రశ్నించారు. భువనగిరి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు బీఆర్ఎస్ నిరంతరం కృషి చేస్తున్నదని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆలోచించి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జడల అమరేందర్‌గౌడ్, కొలుపుల అమరేందర్, ఎన్నబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్య, కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్

కాంగ్రెస్, బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలి

- ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్

యాదగిరిగుట్ట, మే 9 : ఎస్సీ వర్గీకరణ చేపట్టకుండా రిజర్వేషన్లు తొలగిస్తామంటున్న బీజేపీకి, మాదిగలకు ఒక్క ఎంపీ టికెట్ కేటాయించని కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధి చెప్పాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేశ్ అన్నారు. యాదగిరిగుట్టలో గురువారం మీడియాతో ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తొలగిస్తామంటున్న బీజేపీ.. మాదిగల ఓట్లు ఎలా అడుగుతారో సమాధానం చెప్పాలన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని చెప్పి పది సంవత్సరాలు గడిచినా పార్లమెంట్‌లో పది నిమిషాలు కూడా వర్గీకరణ అంశాన్ని లేవనెత్తకుండా మాదిగల ఓట్లు అడగడం సిగ్గు చేటని విమర్శించారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మాదిగలకు ఎంపీ టికెట్ ఎందుకు కేటాయించలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పి మాదిగలను ఓట్లడగాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణపై తీర్మానం చేసి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లిన బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ వెంటే మాదిగలు ఉంటారని తెలిపారు. మాదిగల అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమని, మొదటి నుంచీ ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్ పార్టీకే ఓటేయాలని మాదిగలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి మీసాల ఉప్పలయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చింతల శంకర్, సీనియర్ నాయకులు పెరుమళ్ల స్వామి, గ్యాదపాక మల్లేశ్, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

రైతు బంధుపై నీలినీడలు !

- ఇంకా పూర్తి స్థాయిలో అందని పంట పెట్టుబడి సాయం
- మరో నెలలో వానకాలం సాగు
- ఐదెకరాల్లోపు వారికేనా? సాగు చేసిన రైతులకేనా?
- రైతుబంధు రూ.10 వేలకే దిక్కులేదు.. రైతు భరోసాకు రూ.15 వేలు ఇస్తారా?
- సీఎం, మంత్రుల విరుద్ధ ప్రకటనల పట్ల రైతుల్లో ఆందోళన
- కాంగ్రెస్ సర్కారుపై మండి పడుతున్న అన్నదాతలు

సూర్యాపేట, మే 10 (నమస్తే తెలంగాణ) : పంట పెట్టుబడికి రంది లేకుండా చేసేందుకు అన్నదాతకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని తీసుకొచ్చింది. ఎకరాకు రూ.5వేల చొప్పున ఏటా రెండు సీజన్‌లకు రూ.10 వేలు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. కానీ కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత రైతు బంధు సక్రమంగా అమలు కావడం లేదు. ఎన్నికల ముందు ఆ పార్టీ రైతు భరోసా పథకం ద్వారా ఏడాదికి ఎకరాకు రూ.15 వేల ఇస్తామని హామీ ఇవ్వగా అదీ నెరవేరలేదు. రైతు బంధు పథకాన్ని కాంగ్రెస్ సర్కారు మొత్తానికే ఎత్తివేసే కుట్ర పన్నుతున్నట్లు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. 'ఐదెకరాల లోపు వారికే ఇస్తాం, సాగు చేసిన భూములకు మాత్రమే ఇస్తాం' అని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు పదేపదే రైతు భరోసాపై విరుద్ధ ప్రకటనలు చేయడం పట్ల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజకీయాల కోసం కాళేశ్వరాన్ని పండబెట్టి, అవకాశం ఉన్నా నాగార్జునసాగర్ నీటిని విడుదల చేయకుండా రైతులపై స్వయం ప్రకటిత కరువును రుద్దిన కాంగ్రెస్ సర్కారు మరోపక్క సాగు చేస్తేనే పంట పెట్టుబడి సాయం ఇస్తామనడంపై వ్యవసాయాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తున్నట్లు అర్థమవుతున్నది. సాగు చేసే రైతులకే మొండి చెయ్యి చూపిస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు ఎలా రైతు భరోసా ఇస్తుందో మరీ.

కేసీఆర్ హయాంలో 11 సీజన్లు నిరంతరంగా..

2018లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన రైతు బంధు ద్వారా నిరంతరాయంగా 11 సీజన్‌లకు పంట పెట్టుబడి సాయం అందించారు. ఉమ్మడి నల్లగొడ జిల్లాలో సుమారు 22 లక్షల ఎకరాలకు సంబంధించి రైతుల బాంకు అకౌంట్లలో డబ్బులు జమయ్యాయి. దాంతో పంట పెట్టుబడికి వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లే పరిస్థితి రైతులకు తప్పింది. రైతు బంధు సాయం చేయడంతోపాటు పండిన ధాన్యాన్ని కూడా కేసీఆర్ సర్కారు కేంద్రాలు ఏర్పాటు చేసి కొన్నది. కానీ నాలుగున్నర నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ యాసంగి సీజన్ పూర్తయి పంటలు చేతికి అందినా ఇంకా పూర్తి స్థాయిలో రైతు బంధు ఇవ్వలేదు. ఇప్పటివరకు ఐదెకరాల్లోపు రైతులకు మాత్రమే రైతు బంధు వచ్చింది. మరో నెల రోజులైతే వానకాలం సీజన్ ప్రారంభం కానుండగా రెండు సీజన్లకు సంబంధించి రైతు బంధు ఇస్తుందో లేదోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ కొత్తగా అమలు చేస్తున్న రైతు భరోసా ఇస్తుందా.. ఉన్నదానికే కొర్రీలు పెట్టి బంద్ చేసే కుట్ర పన్నుతుందా? అనేదానిపై రైతుల్లో ఆందోళన మొదలైంది.

గతంలో సాగుకు ముందే ఇచ్చేది

గతంలో కేసీఆర్ ప్రభుత్వం పంట సాగు చేసే ముందే రైతుబంధు ఇచ్చేది. దాంతో ఆ డబ్బులు దుక్కులకు, విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు అక్కరకు వచ్చేవి. గిప్పుడు కాంగ్రెస్ సర్కారు పంట కోతకు వచ్చిన తర్వాత ఇస్తుండడంతో ఇబ్బందిగా ఉంది. పంట పెట్టుబడికి అప్పు తేవాల్సి వస్తున్నది. ఆ తర్వాత ఇచ్చినా అప్పులకు వడ్డీ కట్టేందుకే సరిపోతున్నది. అప్పట్లో వానకాలం సాగుకోసం రైతుబంధును జూన్‌లోనే వేసేది. ఇప్పుడు వేస్తరో.. వెయ్యరో కూడా తెల్వడం లేదు. దాంతో వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరిగాల్సి వస్తున్నది.

–నీళ్ల శేఖర్, రైతు, జైకేసారం, చౌటుప్పల్

రైతులు అప్పుల పాలవుతున్నరు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు సాయం సీజన్ మొదట్లో కాకుండా పంట కోతలు పూర్తయ్యాక ఇవ్వడం సరికాదు. పంటలు సాగుకు అవసరమైన పెట్టుబడి కోసం రైతులు అప్పు చేయాల్సి వస్తున్నది. పంట దిగుబడి సరిగా రాకపోతే అప్పులు పెరిగి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వస్తది. గత కేసీఆర్ ప్రభుత్వం సీజన్‌లో పంటల సాగుకు ముందే రైతుబంధు సాయం అందించడంతో రైతులకు అప్పుల బాధలు లేకుండా పోయాయి. కానీ ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి పంటలు పూర్తయ్యాక రైతుబంధు సాయం అందిస్తానంటున్నరు. ఇలా చేస్తే రైతులకు పెద్దగా ప్రయోజనం ఉండదు.

–సోమిరెడ్డి పెద వెంకట్‌రెడ్డి, రైతు, ఆత్మకూర్.ఎస్

హమాలీ కొరతతో ధాన్యం రవాణాలో జాప్యం

- సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపీకృష్ణ

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

యాదాద్రి భువనగిరి, మే 9 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో కొన్ని కేంద్రాల వద్ద, మిల్లు పాయింట్ల వద్ద హమాలీ సమస్య ఉండటంతో ధాన్యం రవాణాలో కొంత మేర జాప్యం జరుగుతున్నదని, అన్ని వర్గాల సమన్వయంతో 1.90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగలిగామని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ గోపీకృష్ణ తెలిపారు. గురువారం నమస్తే తెలంగాణలో 'అన్నదాతను ముంచిన సర్కారు నిర్లక్ష్యం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా అధికార యంత్రాంగం మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. గురువారం వరకు 1.90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, 1.80లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు రవాణా జరిగిందని గోపీకృష్ణ తెలిపారు. ఇంకా 1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనాలు ఉన్నాయన్నారు. జిల్లాలో మిల్ పాయింట్ల వద్ద స్థలాభావం ఉండడంతో దాన్ని అధిగమించడానికి సమీప నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు ధాన్యం తరలించనున్నట్లు పేర్కొన్నారు.